క్లుప్తంగా

భూముల రీసర్వే వేగవంతం చేయాలి: జేసీ



పెనుగంచిప్రోలు: భూముల రీసర్వే పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన మండలంలోని తోటచర్ల, గుమ్మడిదుర్రు, వెంకటాపురం, ముచ్చింతాల, లింగగూడెం గ్రామాలో చేపట్టిన భూముల రీసర్వే పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వెంకటాపురంలో సర్వే రాళ్ల త్వరితగతిన పాతాలని, తోటచర్ల, లింగగూడెం, ముచ్చింతాల గ్రామాల్లో కంప్యూటర్‌లో నమోదు సత్వరం పూర్తి చేయాలని సూచించారు. నందిగామ ఆర్డీవో సాయిబాబు, జిల్లా సర్వే ఏడీ శ్రీనివాస్, తహశీల్దార్ కె లక్ష్మీకల్యాణి, ఆర్ఐ జనార్దనరావు, మండల సర్వేయర్ ఎల్.స్వప్న, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నందిగామ: పట్టణంలోని ఎస్టీయూ భవనంలో శనివారం సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం ఎస్టీయూ మండల కార్యవర్గ అధ్యక్షుడిగా పట్నా వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మేకపోతుల రామకృష్ణ, ఆర్థిక కార్యదర్శిగా పి.వెంకటేశ్వరరావు, మహిళా కన్వీనర్‌గా ఆర్.రాజ్యలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మందా రమేష్ వ్యవహరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తిన అరుణ కిషోర్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులు అరెస్ట్



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ధనంబోడు మండవ ఇంజినీరింగ్ కళాశాల వెనుక ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నవారిపై పోలీసులు శనివారం దాడి చేశారు. పట్టణ ఎస్ఐ బీవీ రామారావు ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేశారు. రెండు కోళ్లు, కత్తులు, పది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

ఉత్సాహంగా కార్తీక వన సమారాధన

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక షేర్‌మహ్మద్‌పేట క్రాస్‌రోడ్‌లోని దేచుపాలెం రోడ్‌లో ఉన్న హనుమంతు రత్నకుమారి మామిడి తోటలో ఏర్పాటు చేసి ఈ కార్యక్రమంలో న్యాయవాదులంతా కుటుంబసమేతంగా పాల్గొని ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ కాంతారావు, మాజీ అధ్యక్షులు పసుపులేటి సత్యశ్రీనివాసరావు, ఎర్రమాజు ధనుంజయుడు, ఏజీపీ టీఎల్.నరసింహారావు,మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ గుంటక లక్ష్మీనారాయణ, న్యాయవాదులు సామినేని రాము, సామినేని వెంకటేశ్వరరావు, బద్దుల వెంకట్రామయ్య, ఈవీ జగన్నాథరావు, కాసరగడ్డ నాగేశ్వరరావు, కె.స్టాలిన్, బసవరాజు,జె.శ్రీనివాసరావు, కరణం నరసింహారావు, రాయపూడి శ్రీనివాసరావు, శ్రావణ్, రవి పాల్గొన్నారు.

టోల్‌గేటు సిబ్బంది అత్యుత్సాహం

ఎమ్మెల్సీ లక్ష్మణరావు వాహనం నిలుపుదల

కంచికచర్ల : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కేఎస్‌లక్ష్మణరావుకు కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజాలో శనివారం చేదు అనుభవం ఎదురైంది. ఎమ్మెల్సీ లక్ష్మణరావు గుంటూరు నుంచి జగ్గయ్యపేట పర్యటనకు కారులో వెళ్తుండగా, కీసర టోల్‌ప్లాజా వద్దకు రాగానే వాహనాన్ని టోల్‌ప్లాజా సిబ్బంది ఆపారు. టోల్‌ఫీజు చెల్లించాలని, లేనిపక్షంలో కారును ముందుకు వెళ్లనీయమన్నారు. దీంతో కారులో కూర్చొని ఉన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తాను ఎమ్మెల్సీనని తన గుర్తింపుకార్డును టోల్‌గేట్ సిబ్బంది చూపించినప్పటికీ వారు ఒప్పుకోలేదు. ఎమ్మెల్సీ ఇంత సింపుల్ కారులో వస్తారా అంటూ టోల్‌సిబ్బంది అనుమానం వ్యక్తంచేశారు. అనంతరం ఎమ్మెల్సీ ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో వారి ఆదేశాల మేరకు ఆయన వాహనాన్ని టోల్‌గేట్ సిబ్బంది ముందుకు కదలనిచ్చారు. ఈ ఘటన నేపథ్యంలో కొద్దిసేపు టోల్‌గేట్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టోల్‌సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించడంపై వాహనచోదకులు విమర్శలు గుప్పించారు.

దేవాలయం నిర్మాణానికి రూ. కోటి విరాళం

నరసాపురం (విస్సన్నపేట): నరసాపురంలో నిర్మిస్తున్న సూర్య భగవానుడు, అష్టదైవాలు కొలువుదీరనున్న ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఎన్నారై దంపతులు చింతల చంద్రశేఖర్‌రెడ్డి (చందు), హిమవర్షారెడ్డి రూ.కోటి విరాళం ప్రకటించారని ఆలయ నిర్వాహకుడు గొట్టేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విరాళం దాత తల్లిదండ్రులు చింతల నరసింహారెడ్డి, రమణమ్మ దంపతులను ఆలయం నిర్మాణ నిర్వాహకుడు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ప్రభుత్వ విప్ ఉదయభాను



మక్కపేటలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ సామినేని ఉదయభాను, పక్కన సర్పంచ్ శారమ్మ, ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ దేవమణి, నాయకులు

వత్సవాయి(పెనుగంచిప్రోలు): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. వత్సవాయి మండలం మక్కపేట గ్రామంలో రూ.43లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఒకేసారి 1.50 లక్షల ఉద్యోగాలను అందించిన ఘనత ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హత ఉన్న ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతున్నాయన్నారు. జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో సంక్షేమ పథకాల ద్వారా మక్కపేట గ్రామానికి రూ.27 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. మహానేత వైఎస్సార్ పాలనలో గ్రామంలో 150ఇళ్లతో కాలనీ నిర్మిస్తే నేడు ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో 260 ఇళ్లు నిర్మించామన్నారు. గత టీడీపీ పాలనలో ఒక్కరికి కూడా ఇంటి స్థలం, ఇళ్లు మంజూరు కాలేదన్నారు. బడుగు, బలహీన వర్గాలకు మాత్రమే కాకుండా అగ్రవర్ణాల్లోని పేదలకు కూడా ఈప్రభుత్వంలో అర్హత ఉంటే పార్టీలకతీతంగా పథకాలు అందుతున్న వైనాన్ని అందరూ గుర్తించాలని కోరారు. త్వరలోనే మక్కపేట–భీమవరం మధ్యలో రైల్వేస్టేషన్ వస్తుందని, విజయవాడ నుంచి హైదరాబాద్ వరకు ఈ మార్గంలో ప్యాసింజర్ రైలు నడుస్తుందని వివరించారు. జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని జిల్లాలోనే ముందంజలో ఉంచేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. గతేడాది మిర్చిపంట నష్టపోయిన రైతులకు పరిహారం కింద రూ.3కోట్లు అందించామన్నారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా ఇటీవల తెలంగాణ రాష్ట్ర అధికారులతో కూడా పోట్లాడి సాగర్ జలాలను విడుదల చేయించామని గుర్తుచేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడేటి శారమ్మ, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసుపోగు దేవమణి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గుత్తా శంకరరావు, గ్రామాధ్యక్షుడు కనగాల రమేష్, సొసైటీ అధ్యక్షులు కొండబోలు వెంకటబ్రహ్మం, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు ఆళ్ల కుమారి, ఎంపీడీఓ కె రమేష్ బాబు, పీఆర్ డీఈ కిరణ్, సచివాలయ కార్యదర్శి కొమరగిరి సంక్రాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొమరగిరి భరద్వాజ్, కనగాల భాస్కరరావు, కెవైఎన్ శర్మ, కొండబోలు కోటిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ నాగేంద్రరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదలకు న్యాయం



హనుమంతుపాలెం వాసులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: సొంతిల్లు లేదని ఏఒక్కరూ బాధపడకూడదనే సమున్నత ఆశయంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 30లక్షల మందికిపైగా నిరుపేదలకు ఇళ్లస్థలాలు అందించి వారికి న్యాయం చేశారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని 19వవార్డు హనుమంతుపాలెంలో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను అందజేశారు. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఏ ఒక్కరికి సెంటుస్థలం అందించలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు మంజూరు చేసి సకలవసతులతో ఊళ్లను నిర్మిస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది పేదలు ఇళ్లను నిర్మించుకుని గృహప్రవేశాలు చేశారని గుర్తుచేశారు. నందిగామ నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో ఇంటినిర్మాణ పనులు పూర్తికానివారు త్వరితగతిన పూర్తిచేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు. ప్రజలకు మంచి చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకాలన్నారు. నందిగామలో తనను రెండోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. కౌన్సిలర్ మందా మరియమ్మ, మున్సిపల్ వైస్‌చైర్మన్ పాకాలపాటి కిరణ్, ఏఎంసీ చైర్మన్ మహ్మద్‌మస్తాన్, పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు గాడిపర్తి వెంకటనారాయణ, చావల మల్లికార్జునరావు, కత్రి రవీంద్ర, పాములపాటి రమేష్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సాధికార యాత్రను విజయవంతం చేయాలి



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

నందిగామ టౌన్: నందిగామలో ఈనెల ఐదోతేదీన నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ కోరారు. పట్టణంలోని తొమ్మిది, 10, 15, 16వ వార్డులలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో బస్సు యాత్రకు సంబంధించి శనివారం రాత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ బస్సుయాత్ర నందిగామ పట్టణంలోని ప్రవేశించగానే నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలకాలని సూచించారు. బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సామాజిక సాధికార బస్సు యాత్ర ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మహ్మద్‌మస్తాన్, వార్డు కన్వీనర్‌లు విశ్వనాథపల్లి కృపారావు, కోలేటి నాగరాణి, ఓర్సు జ్వాలా, అచ్చి శ్రీకర్, నాయకులు పత్తిపాటి జయరామారావు, మత్తయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

ముస్లింలకు అండగా జగన్ ప్రభుత్వం

కంచికచర్ల : ముస్లింలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటోందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. కంచికచర్లలో ముస్లిం, మైనార్టీ ముఖ్యనాయకుల ఆత్మీయ సమ్మేళనం శనివారం రాత్రి జరిగింది. ముందుగా ముస్లిం మతపెద్దలు, నాయకులు ఎమ్మెల్సీ అరుణకుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ఎమ్మెల్సీ మాట్లాడుతూ నా ఎస్సీ, నా బీసీ, నా ఎస్టీ, నా ముస్లిం మైనార్టీలు అంటూ నిత్యం మాట్లాడే ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. నందిగామలో ఈనెల 5వ తేదీన జరుగబోయే బస్సుయాత్రను విజయవంతం చేయాలని ముస్లింలను కోరారు. తమకు షాదీఖానా, శ్మశానవాటికకు స్థలం కావాలని ముస్లింపెద్దలు కోరగా, త్వరలోనే షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. రెవెన్యూ అధికారులతో చర్చించి స్థలాన్ని కేటాయించేలా చూస్తానని హామీ ఇచ్చారు. నందిగామ ఏఎంసీ చైర్మన్ షేక్ మస్తాన్, ముస్లిం పెద్దలు షేక్ జానీ, షేక్ రజీమ్, షేక్ మొయిద్దీన్, ఉప సర్పంచి వేమా సురేష్ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదుగుల శంకర్ పాల్గొన్నారు.

అన్నదానంతో తరిస్తున్న అయ్యప్పలు

- రోజూ 300 మందికి అన్నదానం
- 41రోజుల పాటు కొనసాగింపు
- శుక్ర, ఆదివారాల్లో 400 మంది హాజరు
- సేవే పరమావధిగా చద్ది కార్యక్రమం



సద్ది(భోజనం) చేస్తున్న అయ్యప్పదీక్షాపరులు

పెనుగంచిప్రోలు: శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామికి ఎంతో ఇష్టమైన అన్నదాన కార్యక్రమాన్ని పెనుగంచిప్రోలులో శ్రీఅయ్యప్పసేవాసమితి సభ్యులు ఏడేళ్లుగా కొనసాగిస్తూ దీక్షాపరుల మన్ననలు పొందుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి నిత్యం అనేక జిల్లాల నుంచి వస్తున్న శ్రీఅయ్యప్ప దీక్షాస్వాములు సద్ది(భోజనం)కోసం అనేక ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించి, సేవాసమితి సభ్యులు దీక్షాపరుల సౌకర్యార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దర్శనానికి వచ్చే దీక్షాపరులు, ఇంట్లో కుదరని దీక్షాపరుల కోసం మునేరు కాజ్‌వే పక్కన వేంచేసి ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి ఆలయంలో ఏటా ఈసద్ది కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా నవంబర్ 4న శ్రీఅయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు వాసిరెడ్డి బెనర్జీ చేతుల మీదుగా ప్రారంభమైన చద్ది కార్యక్రమం దిగ్విజయంగా సాగుతోంది. ప్రతిరోజూ 300 నుంచి 350 మంది స్వాములు వస్తుండగా, శుక్ర, ఆదివారాల్లో 400 మందికి పైగా స్వాములు ఇక్కడ సద్ది చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్ 14వరకు చద్ది కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మాలాంటి వారికి ఎంతో మేలు..



మేము శ్రీలక్ష్మి తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చాం. దీక్షలో ఎక్కడ పడితే అక్కడ తినే అవకాశం ఉండదు. ఇంట్లో కుదరని వారికి కూడా ఇక్కడ అన్నప్రసాదం అందజేస్తుండటం సంతోషదాయకం. దూరప్రాంతాల నుంచి వచ్చే మాలాంటి వారికి ఇటువంటి కార్యక్రమం ఎంతో ఉపయోగం. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న స్థానిక అయ్యప్పదీక్షాపరులు, నిర్వాహకులకు కృతజ్ఞతలు.

– దీక్షాస్వాములు, విజయవాడ

దాతల సహకారంతో..



ఏడేళ్లుగా దాతల సహకారంతో ఈ చద్ది కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటం సంతోషంగా ఉంది. నాతో పాటు గ్రామానికే చెందిన అయ్యప్ప స్వామి భక్తులు గింజుపల్లి వెంకటేశ్వరరావు నిర్వహణలో పాలుపంచుకుంటున్నారు. ఎక్కడో దూరప్రాంతాల నుంచి వచ్చే దీక్షాపరులు ఇక్కడ చద్ది చేసి, ఎంతో పుణ్యకార్యం చేస్తున్నారని చెబుతున్నప్పుడు మాకు సంతోషంగా ఉంటోంది.

– రేగంట్ల రవికుమార్, నిర్వాహకులు

ఆడుదాం ఆంధ్రాకు 208 మంది నమోదు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఈ నెల 15నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రాకు ఇప్పటివరకు మండలంలోని 21 సచివాలయాల ద్వారా 208మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు శనివారం తెలిపారు. క్రీడల్లో పాల్గొనదలచినవారు ఈనెల 13వతేదీలోగా సచివాలయాల్లో సంప్రదించి లేదా టోల్‌ఫ్రీనంబరు ద్వారా తమపేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

9న ఆదిశంకరాచార్య విగ్రహ ప్రతిష్ట

వేదాద్రి(జగ్గయ్యపేట):మండలంలోని వేదాద్రిలో శ్రీ ఆదిశంకరాచార్యుల విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని ఈనెల తొమ్మిదోతేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తుంగల మురళీకృష్ణ శనివారం తెలిపారు. గ్రామంలోని శ్రీమాత నరసింహ పీఠం సమీపంలో ఉదయం 8.54 గంటలకు శ్రీఆదిశంకరాచార్యుల విగ్రహాన్ని ఆవిష్కస్తామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు వివిధ రకాల పింఛన్‌లను 95శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రమేష్‌బాబు శనివారం తెలిపారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్నారని, మిగిలిన 5శాతం పింఛన్‌దారులకు కూడా అందజేస్తామని ఆయన వివరించారు.

రాయితీపై క్లీనింగ్ వాహనాలు అందజేత



క్లీనింగ్ వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: పరిసరాల పరిశుభ్రతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యతనిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద రాయితీపై మంజూరైన స్వచ్ఛత ఉద్యమి క్లీనింగ్ యంత్రాలను శనివారం ఆయన ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కో వాహనం విలువ రూ. 31.67లక్షలు కాగా రూ. 15.06 లక్షల రాయితీ ఇచ్చినట్లు తెలిపారు. ఐదుగురు లబ్దిదారులకు కలిపి ఒక వాహనాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ఈ వాహనాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థిక స్వావలంబన సాధించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాటకొండ రామకోటేశ్వరరావు, బండారు వెంకట్రావ్, షేక్ జాఫర్, అచ్చి చిన్నబాబు, మాడుగుల మనోహర్, బాపట్ల సాంబయ్య, షోడగిరి సతీష్, అనుమోలు సారధి, కమిషనర్ జయరాం పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నందిగామ టౌన్: దాములూరు కూడలిలో చేపట్టిన రాజరాజేశ్వరీదేవి ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ శనివారం శంకుస్థాపన చేశారు. ముందుగా ఆయన గ్రామంలోని సంగమేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం సీజీఎఫ్ నిధులు రూ.62 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అరుణకుమార్‌ను ఘనంగా సత్కరించారు. జడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, నువ్వుల విశ్వనాథం, నాయకులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

• ‘అమ్రితసాయి’లో ఫ్రెషర్స్ డే వేడుకలు

కంచికచర్ల మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడులకను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ కె.రామ్మోహన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఫ్రెషర్స్ డే వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఆడిపాడారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– పరిటాల(కంచికచర్ల)

ఓటరు నమోదు కేంద్రాల తనిఖీ



ముండ్లపాడులో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేసీ సంపత్‌కుమార్



నందిగామలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): ఓటరు జాబితాల్లో తప్పులు లేకుండా బీఎల్‌ఓలు జాగ్రత్తగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని ముండ్లపాడు గ్రామంలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటు నమోదు కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ దరఖాస్తుదారుల నుంచి కొత్తగా ఫారం–6, 7, 8 తీసుకుని, ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ లక్ష్మీకల్యాణి, వీఆర్వో సుధశ్రీ ఉన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి(పెనుగంచిప్రోలు): వత్సవాయి మండలంలోని గోపినేనిపాలెం, మంగొల్లు, దేచుపాలెం తదితర గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను జేసీ తనిఖీ చేశారు. ఓటు నమోదు సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. తహశీల్దార్ పి.వైకుంఠరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మండలంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో శనివారం ప్రత్యేక ఓటరు నమోదు ప్రచార దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ పి.శంకరబాబు సందర్శించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు ఆదివారం సాయంత్రం ఐదుగంటల వరకు అర్హులైన యువతీ యువకుల నుంచి ఓటునమోదుకు అర్జీలు తీసుకుంటారన్నారు. 18ఏళ్లు నిండినవారంతా ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ తహశీల్దార్ షేక్ నాగుల్‌మీరా, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నందిగామలో 935 అర్జీలు.

నందిగామ: ప్రత్యేక ఓటరు నమోదు, ప్రచార దినోత్సవ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ పి.సాయిబాబు కోరారు. నందిగామలోని పోలింగ్‌కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. నందిగామ నియోజకవర్గంలో కొత్తగా ఓటు నమోదు కోరుతూ 516 దరఖాస్తులు, ఓటు తొలగింపు కోసం 205 అర్జీలు, ఓటర్ల జాబితా సవరణల కోరుతూ 214 అర్జీలు అందినట్లు ఆర్డీవో వివరించారు.

వీరులపాడు మండలంలో..

జుజ్జూరు(వీరులపాడు): ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా మండలంలోని జుజ్జూరులోని పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ ఆశయ్యానాయక్ శనివారం పరిశీలించారు. ఓటు నమోదు కార్యక్రమంలో నిబంధనలను తప్పకుండా పాటించాలని బీఎల్‌ఓలకు సూచించారు.



పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేస్తున్న జగ్గయ్యపేట తహశీల్దార్ సూర్యారావు

జగ్గయ్యపేటలో 863 దరఖాస్తులు

జగ్గయ్యపేట అర్బన్: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం కూడా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతుందని తహశీల్దార్ సూర్యారావు తెలిపారు. జగ్గయ్యపేట, చిల్లకల్లులోని పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. తొలిరోజు శనివారం నూతనంగా ఓటు కోసం 663 అర్జీలు, ఓటు తొలగింపునకు 79 అర్జీలు, ఓటర్ల జాబితాలో సవరణలు కోరుతూ 121 అర్జీలు అందినట్లు వివరించారు.

ఔషధ మొక్కల ప్రదర్శన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో శనివారం ఏపీ ప్రభుత్వం ఆయుష్‌శాఖ ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ వారి ఆధ్వర్యంలో ఔషద మొక్కల ప్రదర్శనను నిర్వహించారు. సుమారు 150 రకాల ఔషద మొక్కల గురించి వివరిస్తూ, వ్యాధులను నివారణలో వాటి ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. చేగు విద్యాలయం, నాగార్జున విద్యాలయం, విజ్ఞాన్ స్కూల్, లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్ విద్యార్థులు ఈ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారులు డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ కవిత, డాక్టర్ కృష్ణమోహన్, వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ బుస్సా సరిత, ప్రిన్సిపాల్ సురేష్, డైరెక్టర్ జ్వాలిత్ సాయి పాల్గొన్నారు.

86శాతం మందికి పింఛన్లు పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. పట్టణంలోని 14 సచివాలయాల పరిధిలోని 31వార్డుల్లోని పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి వలంటీర్లు పింఛన్ నగదు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు పట్టణంలోని 86శాతం మందికి పింఛన్‌ను అందజేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

వీరులపాడు: రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 4వతేదీన ఆవేదన దీక్ష, 11న ఛలో విజయవాడ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ సమగ్ర శిక్షణ విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులు తెలిపారు. ఈ మేరకు వారు ఎంఈవో–2ను కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మండల కొంటింట్, సీఆర్పీలు పాల్గొన్నారు.